# కాయ్ రాజా కాయ్!

## సిద్దిపేట జిల్లాలో నాలుగు అసెంబ్లీ ఫలితాలపై జోరుగా బెట్టింగ్

- చేతులు మారుతున్న డబ్బులు
- రహస్యంగా నిర్వహణ

**డబ్బులు పోగొట్టుకున్న బాధితులు డయల్ 100కు లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ సెల్: 8712667100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి: పోలీసులు**




సిద్దిపేట రూరల్, డిసెంబర్1: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జిల్లాలో జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. ఈ దందా అంతా రహస్యంగా కొనసాగుతోంది. సిద్దిపేట జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు విజయం సాధిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోరులో గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, జనగామ నియోజకవర్గాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. గజ్వేల్ నుంచి సీఎం కేసీఆర్, ఈటల రాజేందర్ పోటీ ఆసక్తిగా మారింది. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్, దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు, జనగామలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో వీరిలో ఎవరు గెలుస్తారనే విషయం మరో 48 గంటల్లో తేలనుంది. ప్రధానంగా సిద్దిపేట మినహాయిస్తే హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, జనగామపై బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఈ దందాలో గతంలో క్రికెట్ బెట్టింగ్‌లో ఆరితేరిన వారు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో స్థాయి ,అర్హతను బట్టి రూ.5 వేల నుంచి లక్ష వరకు బెట్టింగ్ చేస్తున్నట్లు సమాచారం. ఎగ్జిట్ పోల్స్ అధికార పార్టీకి అనుకూలంగా, కాంగ్రెస్‌కు ప్రతికూలంగా వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాలపై బెట్టింగ్ రాయుళ్లు ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా బెట్టింగ్‌లో ఎంతోకొంత వెనుకేసుకోవాలనే ఉద్దేశంతో ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ బెట్టింగ్‌లో వివిధ పార్టీలకు చెందిన కిందిస్థాయి నాయకుల నుంచి మండల, జిల్లా స్థాయి నాయకుల వరకు ఉన్నట్లు సమాచారం. ఫలితాలు తారుమారు అయితే బెట్టింగ్‌లో నగదు భారీగా పోకుండా ఉండేందుకు ఆర్థిక స్థోమతను బట్టి తక్కువ మొత్తంలో డబ్బు పెడుతున్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా సాగే ఇలాంటి బెట్టింగ్‌పై ఎప్పటికప్పుడు జిల్లా టాస్క్‌ఫోర్స్ నిఘా పెడుతోంది. బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే , ఈ దందాలో ఎవరైనా నగదు పోగొట్టుకున్న బాధితులు ఉంటే డయల్ 100కు లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ సెల్: 8712667100 నంబర్‌కు సమాచారం ఇస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# చలికాలం.. జరభద్రం

- శ్వాస సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- జాగింగ్, వాకింగ్ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- గుండెజబ్బులు ఉన్నవారు ఆరోగ్య నియమాలు పాటించాలి

చలి తీవ్రత పెరగడంతో కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పొగమంచు కురుస్తున్నది. సాయంత్రం నుంచి మొదలుకొని మరునాడు ఉదయం 8గంటల వరకు చలివీస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం చాలామంది వాకింగ్, జాగింగ్ చేస్తున్నారు. చలికాలంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతో జబ్బుల బారినపడతారని నిపుణులు పేర్కొంటున్నారు. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారు జబ్బులు వారిని పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పౌష్టికాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

న్యాల్‌కల్, డిసెంబర్ 1 : చలికాలంలో చల్లని వాతావరణం వణికిస్తుంది. పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ కాలంలో ఆహ్లాదం మాటున జబ్బులు పొంచి ఉంటాయి. ఉదయాన్నే లేచి వాకింగ్, జాగింగ్ ఎక్కువగా చేస్తుంటారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు బయట తిరగకపోవడం మంచిదని, తప్పనిసరైతే తలకు మఫ్లర్, మంకీ టోపీలు, ముఖానికి మాస్కులు ధరించి బయటకు రావడం మంచిదంటున్నారు. దీంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తిచెంది టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు బారిన ప్రమాదం ఉంటుందన్నారు. తాగునీటి విషయంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుషిత నీరు తాగితే డయేరియా వ్యాపించే ప్రమాదకరంగా పరిణమిస్తుందని పేర్కొంటున్నారు.గాలి ద్వారా స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని తెలుపుతున్నారు. మనిషిలో వ్యాధి నిరోధక శక్తి తక్కవగా ఉన్న వారికి ఎక్కువగా జబ్బుల బారినపడే అవకాశం ఉంటుందని, కాబట్టి పౌష్టికాహారం, రోగనిరోధక శక్తి పెంచే ఫుడ్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.





### చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి..



చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదు. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు వాడకం తగ్గించాలి. చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చలికాలంలో బయట తిరగడంతో జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాధులు సోకితే ఆరోగ్యం పాడవుతుంది. వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేసుకోవాలి.

– గణపతిరావు, వైద్యుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం న్యాల్‌కల్

### చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో ఉపశమనం కోసం సొంత వైద్యం మానుకోవాలి.
- వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి
- కాచి చల్లార్చిన నీటిని, వేడి ఉన్న అహారాన్ని తీసుకోవడం మంచింది.
- చలికాలంలో చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతుల మంచిగా కడుకున్న తర్వాతే ఆహారాన్ని తీసుకోవాలి.
- కాళ్లు, చేతులు గోరువెచ్చని నీటితో కడుక్కని వ్యాస్‌లెన్, స్కిన్‌లోషన్ రాసుకోవాలి
- ఇంటి పరిసరాలు, ఇంట్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. దోమతెరలను వాడటం మంచిది.
- శీతల పానియాలు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వాటిని చిన్నారులకు ఇవ్వకూడదు.
- చిన్నారులకు స్వెటర్లు వేయకుండా ఇంటాబయట తిరగనివ్వద్దు
- గుండె సంబంధించిన వ్యాధులతో బాధపడే వారు చాలా జాగ్రతగా ఉండాలి.
- వీలైనంత వరకు బయట తిరగరాదు. దీంతో గుండెపోటు, ఛాతినొప్పి అవకాశాలు ఎక్కువగా వస్తాయి.
- హృద్రోగంతో బాధ పడేవారు సమయానికి మందులు వేసుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- వీలైనంత వరకు సూర్యుడు కాస్త వెలుగులోకి వచ్చిన సమయంలోనే జాగింగ్, వ్యాయామం చేయాలి.
- సాయంత్రం, రాత్రివేళల్లో వాహనాన్ని నడపకపోవడం మంచిది.
- ముఖ్యంగా ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లే సమయంలో బాగా చలివేస్తుంది. అలాంటప్పుడు స్కార్ఫ్, జర్కిన్, తలకు హెల్మెట్, మంకీక్యాప్స్, కాళ్లకు షూ, చేతులకు గౌజులు వేసుకోవాలి.



# నారు అమ్మకాలతో లాభాలు

- నల్గొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్ ప్రాంతాల నుంచి రామాయంపేట అంగళ్లకు..
- నారు అమ్మకాలతో లాభాలు గడిస్తున్నామంటున్న రైతన్నలు



విక్రయాలకు సిద్ధంగా ఉన్న ఉల్లినారు

రామాయంపేట, డిసెంబర్ 1: నారు అమ్మకాలతో రైతన్నలు లాభాలు గడిస్తున్నారు. సూదూర ప్రాంతాలైన నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, కల్హేర్ తదితర ప్రాంతాల నుంచి రామాయంపేటలో ప్రతి వారం జరిగే బుధవారం సంతకు వివిధ రకాల నారు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రామాయంపేట అంగడితోపాటు మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, చేగుంట, తూప్రాన్, నర్సాపూర్ ప్రధాన కేంద్రాల్లో నిర్వహించే అంగళ్లలోనూ ఇతర జిల్లాల వాసులు అంగళ్లకు తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఈ నారును సూర్యాపేట, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల నుంచి తరలిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఆ రైతులు తీసుకురావడానికి ఖర్చు ఎక్కువైనా వెనుకాడకుండా తమ వద్ద ఉన్న ఉల్లి, పచ్చిమిర్చి, టమాట, పాలకూర తదితర నారును ఒక్కో రైతు నాలుగైదు బస్తాల పైనే ఒక్కో అంగడికి తీసుకొచ్చి విక్రయించుకుంటున్నారు. రామాయంపేటలో చుట్టూ ఉన్న మండలాలతో పాటు గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండడంతో రైతులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంది. ఈ అంగళ్లలో తాము సుమారు రూ.30వేల వరకు అమ్మకాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉల్లినారు అమ్మకాలతో తమ ఖర్చులు పోను తమకు రూ.20వేల వరకు సంపాదిస్తామని సూర్యాపేట, నల్లగొండకు చెందిన రైతులు చెబుతున్నారు. తాము ఇతర పంటల జోలికి వెళ్లమని, కేవలం కూరగాయల పంటలు వేసుకుని విక్రయాలు జరుపుతామని వారు చెబుతున్నారు. తమకున్న వ్యవసాయంలో మొత్తం ఆరుతడి పంటలే వేస్తామన్నారు.

### ఎకరానికి రూ.5లక్షలకు పైనే రాబడి

ఏడాదంతా కష్టపడి అమ్మకాలు చేస్తే తాము ఎకరం పొలంలో రూ.5 లక్షలకు పైగానే లాభాలు గడిస్తామన్నారు. తాము అంతర పంటలు వేసుకోవడంతో పాటు ఉల్లి, టమాటా, మిర్చి, పాలకూర, మెంతి, కొత్తిమీర, పుదీనా తదితర పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నామని వారు చెబుతున్నారు.

### రెండెకరాల్లో ఉల్లినారే నాటుతా

నాకున్న రెండెకరాల్లో ప్రతిసారి ఆరుతడి పంటలనే వేసుకుంటా. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఎక్కువగా ఉల్లి సాగునే ఎంచుకుని సాగుచేస్తున్నా. ఉల్లి సాగును అంగళ్లలో విక్రయాలు జరుపుతూ లాభాలు గడిస్తున్నా. నాకు ఈ ఉల్లి సాగే ఉపాధినిస్తున్నది. వంద కిలోమీటర్ల దూరమైనా ఉల్లినారు తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నా.

– వెంకటరావు, రైతు, సూర్యాపేట జిల్లా



### మిర్చి, టమాటా నారు అమ్ముతా

నాకున్న అరెకరం భూమిలో మిర్చి నారు పెట్టాను. మిర్చి నారుతోపాటు టమాటా నారు కూడా వేస్తాం. రెండు నెలల్లో నారు చేతికొస్తుంది. నారును సంచుల్లో తీసుకుని బస్సులు లేక ఆటోల్లో అంగళ్లకు తీసుకొస్తాం. రామాయంపేట అంగడిలో గిరాకీ బాగానే ఉంటుంది. అందుకు నేను ఇక్కడికి నారు తీసుకొస్తా. లాభాలు మంచిగానే వస్తాయి.

– ఈశ్వర్‌గౌడ్, రైతు, నారాయణఖేడ్, సంగారెడ్డి జిల్లా





అమ్మకాలకు సిద్దంగా ఉన్న మిర్చి, టమాట నారు



రామాయంపేట మార్కెట్‌లో నారును విక్రయాలు చేస్తున్న అన్నదాతలు

### ఆరుతడి పంటలతోనే లాభం

గత ఏడాది నుంచి నా భూమిలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న. మంచి లాభాలు వస్తున్నాయి. రామాయంపేట అంగడికి వస్తే మా నారును హైదరాబాద్, నిజామాబాద్‌కు వెళ్లే రైతులు, ప్రయాణికులు బాగా తీసుకుంటరు. ఇక్కడైనంత గిరాకీ ఎక్కడా కాదు. నాలుగు సంచుల్లో నాను తెస్తే రెండు గంటల్లోనే అమ్ముకుంటా.

– గొల్ల మల్లేశం, రైతు, నల్లగొండ జిల్లా



# వేపపూత యూరియాతో ప్రయోజనం

- నత్రజని వృథా శాతం తగ్గుదల
- పంటలకు మేలైన నేస్తం



నిజాంపేట్, డిసెంబర్ 1:పైర్లకు వేపపూత యూ రియా వాడడంతో బహుళ ప్రయోజనాలున్నాయి. మార్కెట్‌లో సాధారణ యూరియా, వేపపూత యూరి యా వేర్వేరుగా లభిస్తున్నది. ఇక నుంచి వేపపూత యూరియానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం సంబంధిత కంపెనీలకు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

**వేపతో ప్రయోజనాలు**

వేపచెట్టు రైతు నేస్తం. వేపగింజలు, ఆకులు, నూనె, బెరడు, వేర్లు ఇలా ప్రతి భాగం ఉపయోగమే. ఇలాంటి లక్షణాలతో వేప వృక్ష సంబంధిత క్రిమిసంహారిణిగా పేరు పొందింది. వేపగింజల్లో నూనె అధికశాతం ఉండడంతో వేప విలువ మరింత పెరిగింది.

**యూరియాతో మేలు**

పంటకు 80శాతం నత్రజని పోషకాన్ని యూరియా రూపంలోనే అందిస్తారు. యూరియాలో నత్రజనితో పాటు 20శాతం కర్బనం, 26శాతం ఆక్సిజన్, 6 శాతం హైడ్రోజన్ మూలకాలు ఉంటాయి. సాధారణ యూరియాతో నత్రజని పోషకాన్ని పూర్తిగా ఉపయోగించుకోక వృథాగా భూమిలోకి పోతుంది. కానీ వేపపూత యూరియా మాత్రం అందుకు భిన్నంగా పనిచేస్తుంది. రెండు విలువైన ప్రక్రియల సమ్మేళన ఫలితంగా వేపపూత యూరియా తయారవుతుంది. గాలి, సహజ వాయువుల ఆధారంగా యూరియా తయారీ మొదటి అంశం, ఆ తర్వాత సన్న యూరియా తయారీ చివరిదశలో ఒకేలా వేపనూనెను పూతగా పట్టించడం రెండో అంశం. వేపనూనెను యూరియా మీద ఒకపొర మాదిరిగా ఏర్పాటుచేయడంతో రైతులకు పలువిధాలుగా లాభాలున్నాయి.

**వేపపూత యూరియాతో లాభాలు**

- సాధారణంగా యూరియా తేమను గ్రహించి బస్తాలో కొంతమేర గడ్డ కడుతుంది. వేపపూత యూరియాలో వేపనూనె యూరియా గుళికలపై పొరలా ఏర్పడుతుంది. దీంతో యూరియా తేమను త్వరగా గ్రహించలేదు.
- సాధారణ యూరియా నీటిలో త్వరగా, సులభంగా కరిగిపోతుంది. భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు యూరియాలో అధికశాతం నత్రజని మొక్కలకు అందకుండా నేల లోపలి పొరల్లోకి చేరుతుంది. వేపపూత యూరియా వాడినప్పుడు ఈ సమస్య తగ్గుతుంది.
- సాధారణ యూరియాకు సూర్యరశ్మి, గాలి తగిలినప్పుడు ఆవిరవుతుంది. వేపపూత యూరియాలో ఈ సమస్య ఉండదు.
- వేపపూత యూరియా ద్వారా విడుదలయ్యే నత్రజని పోషకం నెమ్మదిగా మొక్కలకు అందుతుంది. దీంతో వృథాశాతం తగ్గుతుంది.
- వినియోగ సామర్థ్యం 10–15 శాతం అధికమై 5–10శాతం దిగుబడులు పెరుగుతాయి.

**పనితీరు..**

- సాధారణ యూరియాలో నత్రజని అమోనియా రూపంలో ఉంటుంది.
- యూరియాను పొలాలకు వేసినప్పుడు... భూమిలో ఉండే నైట్రిఫయింగ్ బ్యాక్టీరియా అమోనియా రూపంలో ఉన్న నత్రజనిని నైట్రేట్ రూపంలోకి మారుస్తుంది. దీంతో అది మొక్క వేరు వ్యవస్థకు అందకుండా నేల పొరల్లోకి వెళ్లి వృథా అవుతుంది. వేపపూత యూరియా వాడినప్పుడు, ఈ బ్యాక్టీరియా ప్రభావం తగ్గి నత్రజని వృథా కాదు.

**వాడే విధానం..**

- పంట అవసరాలకు అనుగుణంగా రెండుసార్లు వేపపూత యూరియా వేయాలి.
- భూమిలో సరైన తేమ ఉన్నప్పుడే యూరియా వేయాలి.
- వరిలాంటి పంటలకు నీటిని తీసివేసి యూరియా వేయాలి. పంటకు మరుసటి రోజు నీరు పెట్టాలి.
- తేలిక పొలాల్లో తేలికపాటి తడిచ్చి వేపపూత యూరియా వేయాలి.
- బరువు నేలలో తడిచ్చే ముందు ఎరువు వేస్తే సరిపోతుంది.
- సాయంత్రం వేళల్లోనూ, డ్రిప్‌ద్వారా వేపపూత యూరియా వేస్తే నత్రజని శాతం బాగా తగ్గుతుంది. నత్రజని ధాతువు లోపించినా, నీటి సరఫరా తగినంత లేకపోయినా, పంటకు ఎండబెటకు గురైనా వేపపూత యూరియాను పంటమీద పిచికారీ చేస్తే తప్పక ప్రయోజనం చేకూరుతుంది.